సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 31 । జూలై । 2023



ఓ ఇంటి వారైన పేదలు

టిడ్కో గృహ సముదాయం పరిస్థితిపై 2019 అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది.

- 8లో



లాడ్జిలో మహిళ హత్య

పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలో ఉన్న చందన్ ఎ.సి లాడ్జిలో ఓ మహిళ హత్యకు గురైంది.

- 8లో



320 కేజీల గంజాయి స్వాధీనం

మెంటాడ మండలంలోని లోతుగెడ్డ సమీపంలో సుమారు 320 కిలోల గంజాయి పట్టుకుని సీజ్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్

రాములోరి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



యాగశాలలో పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామిని హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణ, జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ తదితరులను అర్చకులు పూర్ణకుంభంతో శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. అనంతరం శ్రీ సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. యాగశాలలో నిర్వహించిన సుందరాకాండ హవనం, ఆదిత్య హృదయ హవనం కార్యక్రమాల్లో న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి సాయి కళ్యాణచక్రవర్తి, ఈవో కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

వంగర-రాజాం రోడ్డుపై ఏనుగులు



వంగర-రాజాం రోడ్డు దాటుతున్న ఏనుగు

వంగర: మండల పరిధి మడ్డువలస వద్ద వంగర - రాజాం రోడ్డుపై ఏనుగులు సంచరిస్తున్నాయి. ఆదివారం సాయంత్రం సమయానికి సంగాం పంట పొలాల్లోని సంచరించిన ఏనుగులు రాత్రి సమయంలో రోడ్డుకు అడ్డంగా రావడంతో ప్రయాణికులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు నిలిపివేసి గంటల తరబడి వేచి ఉన్నారు. ఎలిఫెంట్ టీకర్స్, అటవీశాఖ సిబ్బంది వాటితో ఉంటూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

అమృత్ భారత్ కింద రైల్వేస్టేషన్‌ల ఆధునికీకరణ



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

విజయనగరం టౌన్: అమృత్ భారత్ పథకంలో భాగంగా ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ పరిధిలో ఎంపికైన రైల్వేస్టేషన్‌లను పరిశీలించేందుకుగానూ నూతనంగా వచ్చిన రైల్వే డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ ఆదివారం ఆకస్మిక పర్యటన చేశారు. అభివృద్ధికి కావాల్సిన అంశాలపై అధికారులతో రైల్వేస్టేషన్‌లోని వీఐపీ లాంజ్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం రైల్వేస్టేషన్ బయట ఉన్న ప్రాంతాలను పర్యవేక్షించారు. పలు సూచనలు చేశారు. అప్రోచ్ రోడ్డు పెంచాల్సిన అవసరంపై ఆరా తీశారు. రైల్వేస్టేషన్‌లో ఫుడ్ కోర్టులు పనితీరు, నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా.. లేదా.. అనేది పర్యవేక్షించి, మరింత మెరుగైన అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమర్షియల్ మేనేజరు చక్రవర్తి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణహోమం ఆపాలి

- రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్



సమైక్య నినాదం పిలుపుతో ప్రజా సంఘాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: మణిపూర్‌లో గత మూడు నెలలుగా జరుగుతున్న మారణహోమం అదుపు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది సంఘం కార్యాలయంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఆయా సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వందల మంది పౌరులు ప్రాణాలు కోల్పోయి, వందల మంది తీవ్ర గాయాల పాలై చికిత్స పొందుతున్నారని అన్నారు. మహిళల పట్ల అమానవీయంగా దాడి చేసి వారి మానాలను హరించిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమైక్య నినాదం వినిపించారు. బాధిత మహిళలకు తగు రక్షణ, ఉపశమన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు. సమతా విభాగం జిల్లా కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఎం.శ్రీనిసా, చీకటి దివాకర్, కురుణ, బి.పావని, జేవీకే ఈశ్వరరావు, కె.శ్రీనివాస్, సీహెచ్ పావని, ఎస్.చిన్నాదేవి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు

- తల్లి, పిల్లల తరలింపునకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు
- సర్కారీ ఆస్పత్రులపై ప్రజల్లో పెరిగిన నమ్మకం
- గర్భిణుల ప్రసవాలపై పచ్చ మీడియా పిచ్చి కథనాలు
- వైద్యుల నియామకంతో మరిన్ని సేవలు
- మన్యం జిల్లా ఏర్పాటు నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,460 ప్రసవాలు

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన వంతు నిరంతరం కృషి చేస్తోంది. ఇందుకు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలని సంకల్పించి గర్భిణిగా ఉన్న కాలం నుంచే తల్లికి పౌష్టికాహారం అందజేస్తూ ప్రసవమయ్యే వరకు... తరువాత బాలింతగా ఉన్న సమయంలో కూడా వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం అందజేస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసింది. అన్ని సదుపాయాలు తల్లీబిడ్డలకు అందేలా చర్యలు చేపట్టింది. దీన్ని గుర్తించలేని పచ్చ మీడియా పచ్చి అబద్ధాలు రాస్తూ కాలం వెళ్లదీస్తోంది.



ఆహ్లాదకర వాతావరణంలో పార్వతీపురం మండలం డోకిశీల పీహెచ్‌సీ

పార్వతీపురం టౌన్: గర్భిణులు, బాలింతలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న సేవలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవ సేవలు పొందేందుకు గర్భిణులు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు. ఆస్పత్రి వైద్యులు కూడా సుఖ ప్రసవాలు చేసి వారి వేదనను దూరం చేస్తున్నారు. తల్లీబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. ప్రసవం అనంతరం కోలుకున్నాక తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి సురక్షితంగా చేరుస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా అందుతున్న సేవలు పొందేందుకు గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేరుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన నాటి నుండి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య 16,652 మంది అయితే అందులో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,460 మంది ప్రసవాలు పొందారు. ఇదే సర్కారీ వారి ఆస్పత్రుల పట్ల గర్భిణులకున్న నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం. ప్రభుత్వం గర్భిణులకు అందిస్తున్న సేవలపై ప్రతిపక్షం తన అనుకూల మీడియాతో ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నంలో భాగంగా ఈనాడు దిన పత్రికలో ప్రచురితమైన పీహెచ్‌సీల్లో ప్రసవాలేవి..? కథనానికి 'సాక్షి' ఫ్యాక్ట్ చెక్ కథనం.

ప్రభుత్వ ఆస్పత్రులపై గర్భిణుల ఆసక్తి

ప్రభుత్వాస్పత్రులకు గర్భిణులను సాదరంగా ఆహ్వానిస్తున్నారు. సుఖ ప్రసవాలు చేసి వేదనను దూరం చేస్తున్నారు. తల్లీబిడ్డలను కంటికి రెప్పలా సాకుతున్నారు. కోలుకున్నాక తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నారు. పైసా ఖర్చు లేకుండా అందించే సేవలు పొందేందుకు గర్భిణులు ఆసక్తి చూపుతున్నారు. దీనికి ప్రభుత్వాస్పత్రుల్లో నమోదవుతున్న ప్రసవ కేసులే నిలువెత్తు నిదర్శనం. అక్కడి వైద్యులు, సిబ్బంది అందించే సేవలకు కొలమానం.

మన్యంలో ఆస్పత్రుల వివరాలు...	
జిల్లాలో గైనిక్ సేవలందించే ప్రభుత్వాస్పత్రులు	48
24 గంటలు పని చేసే పీహెచ్‌సీలు	37
సాధారణ పీహెచ్‌సీలు	05
సీహెచ్‌సీలు	03
ఏరియా ఆస్పత్రులు	03
ఎస్ఎన్‌సీయూ	01
జిల్లా ఆస్పత్రి	01

పాలన మారింది. 'నాడు - నేడు' అనేలా ప్రభుత్వాస్పత్రులకు మౌలిక సదుపాయాలు సమకూరాయి. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకాలు జరిగాయి. సేవల్లో జవాబుదారీతనం పెరిగింది. ఫలితంగా ప్రభుత్వాస్పత్రుల్లో అందించే వైద్యంపై జనంలో నమ్మకం పెరిగింది. అధిక మంది గర్భిణులు సర్కారు దవాఖానాల్లో వైద్యసేవలు పొందుతున్నారు. ప్రసవం కోసం స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు.

వైద్యుల నియామకంతో మరిన్ని సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య పరికరాలు ఉన్నప్పటికీ కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యులు లేకపోవడంతో పీహెచ్‌సీల నుంచి జిల్లా ఆస్పత్రికి కేసులు వస్తున్నాయన్న విషయాన్ని గ్రహించిన అధికారులు జిల్లాలో 18మంది వైద్యుల కొరత ఉందని ప్రభుత్వానికి నివేదికను అందించారు. తక్షణమే స్పందించిన ప్రభుత్వం నూతనంగా ఏర్పడ్డ మన్యం జిల్లాకు 18 మంది వైద్యులను నియమించారు. దీంతో జిల్లాలోని వైద్యుల కొరత లేకపోవడంతో గర్భిణుల ప్రసవానికి పీహెచ్‌సీల్లో వీలవుతుంది. దీంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా ఆస్పత్రిలో సిజేరియన్ ప్రసవాల విభాగం



తల్లీబిడ్డలను తరలించే ఎక్స్‌ప్రెస్

పుట్టిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ

ఆస్పత్రుల్లో నెలల తక్కువగా పుట్టినా, బరువు తక్కువగా పుట్టినా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి కోసం ప్రత్యేకంగా జిల్లా ఆస్పత్రిలో ఎస్ఎన్‌సీయూ వార్డును ఏర్పాటు చేశారు. జిల్లా ఆస్పత్రి కేంద్రంలో అధునాతన సాంకేతికతతో కూడిన ఎస్ఎన్‌సీయూ యూనిట్లలో వైద్యాన్ని అందజేస్తున్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను ఆస్పత్రుల్లోనే వేస్తున్నారు. ఈ సౌకర్యాల వల్ల గతంతో పోలిస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా



జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉన్నారు. అంతేకాకుండా ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అందించని వైద్యాన్ని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో అందిస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మహిళలు ప్రసవాలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకంతో వస్తున్నారు. అందుకు తగ్గ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలకు తొలి ప్రాధాన్యం.

– డా. బి.జగన్నాథరావు, డీఎంఅండ్‌హెచ్‌వో, పార్వతీపురం మన్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు..



ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులు చేరగానే అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నాం. సాధారణ ప్రసవాలు జరిపేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. అవసరమైన వారికి సిజేరియన్ చేస్తున్నాం. గర్భిణులకు ప్రత్యేక ప్రసూతి విభాగం, ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. పీహెచ్‌సీల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయి. మాతాశిశు సంరక్షణకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రసవ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

– డా. బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త, పార్వతీపురం మన్యం

కక్షిదారులకు సత్వర న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి

- హైకోర్టు న్యాయమూర్తుల సూచన
- అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభించిన న్యాయమూర్తులు

విజయనగరం లీగల్:

జిల్లాలో కొత్తగా ఏర్పాటైన న్యాయస్థానాల ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు అన్నారు. ఈ దిశగా న్యాయాధికారులు, న్యాయవాదులు కృషి చేయాన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఐదుగురు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జిల్లా న్యాయస్థానాల సముదాయంలో కొత్తగా మంజూరైన అదనపు సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాన్ని ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ దుప్పల వెంకటరమణలతో కలసి ప్రారంభించారు. న్యాయ సేవాసదన్‌లో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని జస్టిస్ ఏవీ శేషసాయి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి మాట్లాడుతూ యువ న్యాయవాదులకు తగిన శిక్షణ ఇచ్చి మెరికల్లాంటి న్యాయవాదులను అందించాలని సీనియర్ న్యాయవాదులకు సూచించారు. మంచి, నాణ్యమైన వాదనలు వినిపించే న్యాయవాదులు వున్నప్పుడే నాణ్యమైన తీర్పులు కూడా వస్తాయన్నారు. మహాకవి గురజాడను స్మరించుకుంటూ ఈ నేల ఎంతో ధన్యమైనదని పేర్కొన్నారు. ఉద్దండులైన న్యాయమూర్తులు, న్యాయవాదులను ఈ జిల్లా అందించిందన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ జిల్లాలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం 2012లోనే ప్రతిపాదనలు చేసినా.. 2019 తర్వాత దీనిపై దృష్టి సారించి తగిన ప్రయత్నాలు చేయడంతో ప్రస్తుతం కోర్టు ఏర్పాటు సాధ్యమైందన్నారు. ప్రస్తుతం రెండు కోర్టులు ఏర్పాటైనందున న్యాయవాదులు, న్యాయాధికారులు సమష్టిగా పనిచేసి పెండింగ్‌లోని కేసులు సత్వరంగా పరిష్కరించే ప్రయత్నం చేయాలన్నారు. జిల్లాలోని కోర్టుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కలెక్టర్లు కోర్టు యంత్రాంగానికి సహకరించాలని సూచించారు.

న్యాయవాద వృత్తిలో రాణించాలంటే తగిన పరిజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు యువ న్యాయవాదులు ప్రయత్నించాలని జిల్లా పోర్టు ఫోలియో జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సూచించారు. వారు ఈ వృత్తిలో చేరేముందు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని చెప్పారు. న్యాయమూర్తి జస్టిస్ ఉపమాక దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని న్యాయస్థానాల భవనాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోందన్నారు. సాలూరు, పార్వతీపురం న్యాయస్థానాలు మినహా ఇతర కోర్టు భవనాల పరిస్థితి దయనీయంగా వుందన్నారు. జిల్లాలోని ఎస్.కోట, కొత్తవలస, చీపురుపల్లి, బొబ్బిలి తదితర ప్రాంతాల్లోని కోర్టులకు కొత్త భవనాలు మంజూరు చేయించే దిశగా ప్రయత్నాలు చేస్తామన్నారు. ఎస్.కోట, కొత్తవలస, చీపురుపల్లి, బొబ్బిలిలో కోర్టు భవనాల నిర్మాణానికి అంచనాలు రూపొందించామన్నారు. జిల్లా కోర్టు భవన సముదాయంలో ఒక కాన్ఫరెన్స్ హాలు కూడా ఏర్పాటు కోసం సూచన చేశామన్నారు. న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ మాట్లాడుతూ జిల్లా కోర్టు భవనంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల శారీరక, మానసిక ధృఢత్వం కోసం తగిన వసతులు ఏర్పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో కోర్టులకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చడంలో సహకారం అందిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. కేసుల పరిష్కారంలో న్యాయ వ్యవస్థ నుంచి పోలీసులకు పూర్తి సహకారం వుందని ఎస్పీ ఎం.దీపిక చెప్పారు. జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణచక్రవర్తి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చొక్కాపు దామోదర్ రామ్మోహన్, కేవీఏ తమ్మన్న శెట్టి మాట్లాడారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ప్రతినిధులు, వి.జి.సంతోష్, ఎ.అంజనీ కుమార్, కె.చినప్పారావు నాయుడు, జి.రాంబాబు, కోర్టు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిషిప్‌నకు ఐటీఐ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం డిపోలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, వెల్డర్, సీట్ మెటల్ వర్కర్ ట్రేడ్స్ అభ్యర్థులకు అవకాశం ఉందని తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులు ఆగస్టు 15లోపు డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.అప్రెంటిషిప్‌ఇండియా.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని డిపోల్లో దరఖాస్తులు చేసుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వారికి ఆగస్టు 21న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఈ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూ.118 చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు పది, ఐటీఐ, కుల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, ఇతర పత్రాలతో పాటు సొంత చిరునామాతో రూ.25 విలువైన స్టాంప్‌లు అతికించిన కవరు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 08922- 294906 నంబరును సంప్రదించాలని సూచించారు.

పశు వైద్యానికి పెద్దపీట

- పాడి రైతులకు ప్రభుత్వం అండ
- నియోజకవర్గ కేంద్రాల్లో పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు
- క్షేత్ర స్థాయిలో సేవలు విస్తృతం చేసేందుకు ప్రత్యేకంగా రెండు అంబులెన్సులు
- తక్షణ వైద్య సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962 సేవలు
- జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల ద్వారా 4,787 పరీక్షలు



మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

పాలకొండ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోంది. గ్రామ స్థాయిలో పశు వైద్య సేవల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962ను ఏర్పాటు చేసింది. నియోజకవర్గాల్లో సేవలు విస్తృతం చేసేందుకు ప్రత్యేక అంబులెన్సులు సమకూర్చింది. ఈ నంబరుకు ఫోను చేస్తే పశు వైద్యులు, సిబ్బంది అంబులెన్సుతో పశువు ఉన్న చోటికే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. అవసరమైతే అదే అంబులెన్సులో సమీప పశువైద్య కేంద్రానికి తరలిస్తున్నారు. అంబులెన్సులతో పాటు తాజాగా ప్రతి నియోజకవర్గానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పేరిట ఒక పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ప్రభుత్వం నెలకొల్పింది. వీటిల్లో పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు ప్రయోగశాలల్లో గత నెలలో 4,787 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో..

జిల్లా కేంద్రం పార్వతీపురం మన్యం, సాలూరు, కురుపాం, డివిజన్ కేంద్రం పాలకొండలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీల ప్రాంగణాల్లో ఈ అధునాతన ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్‌లలో కాంట్రాక్టు పద్ధతిలో ఒక ల్యాబ్ టెక్నీషియను, అవుట్‌సోర్సింగ్ విధానంలో ఒక సహాయకుడిని నియమించారు. ఈ కేంద్రాల పర్యవేక్షణ పశుసంవర్ధక శాఖ వైద్యులకు అనుసంధానం చేశారు. డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్, నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల పేరిట ఒక్కో నూతన భవన నిర్మాణానికి రూ.60 లక్షలు, వైద్య పరీక్షలకు అవసరమైన అత్యాధునిక యంత్ర సామగ్రికి రూ.11 లక్షలు వెచ్చించారు. గడిచిన మూడేళ్లగా పాడి అభివృద్ధికి చర్యలు చేపడుతున్న సర్కారు పశువైద్యానికి, అవసరమైన పరీక్షలు చేపట్టేందుకు దశల వారీగా అభివృద్ధి చర్యలు చేపట్టింది.

జిల్లాలో పశు సంపద వివరాలు ఇలా..	
ఆవులు	2,28,681
గేదెలు	46,017
గొర్రెలు	1,73,110
మేకలు	2,07,451
పందులు	5,089
కోళ్లు	8,46,060

ఏయే పరీక్షలు చేస్తారంటే..

- ఈ ల్యాబ్‌లలో పశువుల పేడ, రక్త పరీక్షల ద్వారా పరాన్న జీవుల నిర్ధారణ చేస్తారు.
- రక్త శాతం, తెల్ల రక్తకణాలు, ఎర్ర రక్తకణాలు తదితర పూర్తి స్థాయి రక్త పరీక్షలు.
- గ్లూకోజ్, ప్రొటీన్, క్రియాటినైన్, కాల్షియం, ఫాస్ఫరస్, ఎస్ఓటీ, ఎస్ జీపీటీ, మెగ్నీషియం, బిల్లు రుబిన్, అల్బుమిన్ వంటి బయోకెమిస్ట్రీ పరీక్షలు.
- మూత్రంలో గ్లూకోజ్, ప్రొటీన్, పీహెచ్ శాతం, పాలు, పొదుగు వాపు పరీక్షలు నిర్వహిస్తారు.
- నాసికా స్రావాల పరీక్షలు, చర్మ పరాన్న జీవుల పరీక్ష, ఏబీఎస్టీ యాంటీ బయోటిక్ సెన్సివిటీ పరీక్ష, మిల్క్ కల్చర్, యూటిరైన్ డిశ్చార్జ్ వంటి పరీక్షలు చేపడతారు.
- గొర్రెలు, మేకలకు సీజన్ ప్రాప్తికి పేడ పరీక్షల ద్వారా డీ వార్మింగ్ మందుల అందజేస్తారు.




పాలకొండ ల్యాబ్‌లో పశు సంబంధిత రోగ నిర్ధారణ పరీక్షలు చేపడుతున్న వైద్యులు

ల్యాబ్‌ల్లో నియోజకవర్గాల వారీగా చేపట్టిన పరీక్షలు	
పార్వతీపురం మన్యం	810
పాలకొండ	965
సాలూరు	1359
కురుపాం	721

పాడి రైతులకు బహుళ ప్రయోజనాలు

ప్రభుత్వం మరెన్నో రూపాల్లో పాడి రైతుకు బహుళ ప్రయోజనాలను సమకూరుస్తుంది. ఇప్పటికే అమూల్ సంస్థ భాగస్వామ్యంతో పాల విప్లవానికి శ్రీకారం చుట్టింది. వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల ద్వారా పశు పోషణ, కొనుగోలుకు ఆర్థిక సాయం అందిస్తోంది. దేశీయ మేలు జాతి ఆవుల ఫారాల ఏర్పాటుకు 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. నాణ్యమైన దాణాను అందించేందుకు తయారీ, అమ్మకందార్లకు లైసెన్సులు తప్పనిసరి చేసింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో పశువులు మృతి చెందితే వైఎస్సార్ బీమా సాయం 80 శాతం రాయితీపై అందించడం ద్వారా పాడి రైతులను ఆదుకుంటోంది.

పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు



జిల్లాలో పాడి రంగాన్ని విస్తృత పర్చేందుకు ప్రభుత్వం సహకరిస్తుంది. రైతులు అవగాహన పెంచుకోవాలి. పాడి రైతులకు మరింత అండగా నిలిచేందుకు ప్రత్యేక ల్యాబ్‌లు నెలకొల్పింది. ప్రస్తుత వర్షాకాలంలో పశువులకు అనేక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలు గమనిస్తే వైద్యులను సంప్రదించాలి. అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. ప్రభుత్వ తోడ్పాటుతో పాడి రైతులకు అందించే సేవలన్నీ పూర్తి ఉచితం.

– డాక్టర్ బి.శ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, పార్వతీపురం మన్యం

ఓ ఇంటి వారైన పేదలు

- సారిపల్లిలో 480 మందికి టిడ్కో ఇళ్ల పంపిణీ
- లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలు అందజేత



నా పేరు యడ్ల కామేశ్వరి. మేము విజయనగరంలోని 13వ డివిజన్ కాటవీధిలో నివాసం ఉంన్నాం. నాకు వివాహమై 40 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి అద్దె ఇంట్లోనే నివాసముంటున్నాం. ఇద్దరు పిల్ల లకు వివాహాలు చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల సారిపల్లి జగనన్న నగర్‌లో 300 చదరపు అడుగుల ఇంటి తాళాలు అందుకున్నాం. ఇకపై మేము సొంతింటిలో ఉండగలమన్న ధీమా వచ్చింది. నెల నెలా అద్దె భారం తప్పింది.



సారిపల్లిలో గల జగనన్న నగర్‌లో లబ్ధిదారులకు 300 చదరపు అడుగుల ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలు అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



హాజరైన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులు

విజయనగరం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన గృహ సముదాయాల నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించడంతో అసంపూర్తిగా గబ్బిలాల గూళ్లగా దర్శనమిస్తున్న టిడ్కో గృహ సముదాయం పరిస్థితిపై 2019 అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యయనం చేసింది. ఈ మేరకు అందజేశారు. కనీసం మౌలిక సదుపాయాల కల్పన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివేదించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం విజయనగరం కార్పొరేషన్‌పరిధిలోని ఇళ్లులేని నిరుపేదలకు సారిపల్లి, సోనియా నగర్‌లో కేటాయించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశారు. కాలనీలో నివాసముండే ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాల కల్పన అనంతరం గత ఏడాది 800 మంది లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించగా..తాజాగా ఆదివారం మరో 480 మందికి 300 చ.అ. విస్తీర్ణంలో మంజూరు చేసిన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలు, తాళాలను అందజేశారు. దీంతో అర్హులైన లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ ఇళ్లల్లో నివాసముంటేనే ముఖ్యమంత్రికి ఆనందం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేతృత్వంలో గతంలో ఎన్నడూ కనివినీ ఎరుగనీ విధంగా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని ఏపీ శాసనసభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. సారిపల్లిలో నిర్మించిన టిడ్కో జగన్న నగర్‌లో కేటాయించిన ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను, ఇళ్ల తాళాలను ఉచితంగా అందజేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ ఎటువంటి అవినీతి, లంచగొండి తనానికి తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న నగర్‌లో నివాసముండే ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్‌దీపాలు, రహదారి సౌకర్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయంలో ఏర్పాటు చేశామన్నారు. ఇటువంటి గొప్ప పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తాను కొనసాగడం ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లల్లో వారు నివాసాలు సాగిస్తే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సంతోషిస్తారని, భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ చెప్పారు.

రాష్ట్రవ్యాప్తంగా 72, 480 ఇళ్ల పంపిణీ పూర్తి

రాష్ట్రవాప్తంగా గల వివిధ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో శ్రీకాకుళం నుంచి కర్నూలు వరకు 72,480 గృహాలను లబ్ధిదారులకు అందజేసినట్లు ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. టీడీపీ నాయకులు టిడ్కో కాలనీల వద్దకు నేడు వచ్చి సెల్ఫీలు తీసి విమర్శనాస్త్రాలను సంధించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని ఎద్దేవా చేశారు. 300 చదరపు అడుగుల గృహాలను పూర్తి ఉచితంగా అందించేందుకు 2019 ఫిబ్రవరి 20న ప్రభుత్వం జీవో విడుదల చేసిందని చెప్పారు. దాని ప్రకారమే పేదలకు లబ్ధి చేకూరే విధంగా పూర్తి ఉచితంగా ఆయా ఇళ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చులయా యాదవ్, కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, టిడ్కో ఎస్ఈ డి. నరసింహమూర్తి, ఈఈ జ్యోతి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు కంటుభుక్త తవిటిరాజు, గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, కార్పొరేటర్‌లు, వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జిలు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న ఇచ్చిందే మా ఆస్తి



నాపేరు పాట్నూరు త్రివేణి. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. నాకు ముగ్గురు పిల్లలు. నా భర్త పానీపూరీ వ్యాపారం చేస్తారు. సారిపల్లిలో నిర్మించిన జగనన్న నగర్‌లో 300 చదరపు అడుగుల ఇంటి కోసం దరఖాస్తు చేయగా..ఆ ఇంటి తాళాలను అందజేశారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, విద్యుత్, రోడ్లు నిర్మించారు. ఇది జగనన్న ఇచ్చిన ఆస్తి. ఇక్కపై ఇక్కడే నివాసం ఉంటాం.

క్లుప్తంగా

ఐటీఐలో ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

రాజాం: రాజాంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు సోమవారంతో గడువు ముగుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31తో రిజిస్ట్రేషన్ గడువుతో పాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా పూర్తవుతుందని పేర్కొన్నారు. ఐటీఐ కళాశాలలోనే మొత్తం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తున్నామన్నారు. సివిల్-18, ఫిట్టర్-5, డీజిల్ మెకానిక్ -20, కోపా-30 వరకూ సీట్లు ఉన్నాయని వెల్లడించారు. ఆగస్టు-3న కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు. మిగిలిన వివరాలకు ఫోన్ నంబర్లు 8121450657, 9959502238ను సంప్రదించాలని సూచించారు.

బార్ అసోసియేషన్‌కు విరాళాలు

- ఉదారత చాటుకున్న న్యాయవాదులు



విరాళం అందించిన హైకోర్టు స్పెషల్ ఏపీపీ శ్రావణ్‌కుమార్‌ను అభినందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాద్

విజయనగరం లీగల్: పుట్టిన ఊరును మర్చిపోకుండా, తమ పెద్ద మనసును చాటుకున్నారు పలువురు న్యాయవాదులు. కెరీర్ మొదట్లో ఇక్కడ న్యాయవాదులుగా కొద్ది రోజులు సేవలు అందించి, తరువాత హైకోర్టుకు వెళ్లి ఉన్నత స్థానాలు పొందినప్పటికీ, పుట్టిన గడ్డను మర్చిపోలేదు. తమవంతు సాయాన్ని అందించారు. ఈ మేరకు ఉమ్మడి పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరుకు చెందిన న్యాయవాది నైదాన శ్రావణ్ కుమార్, విజయనగరం బార్ అసోసియేషన్‌కు లక్ష రూపాయలు విరాళం అందించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును హైకోర్టు న్యాయమూర్తుల చేతుల మీదుగా అసోసియేషన్‌కు అందజేశారు. శ్రావణ్ కుమార్ ప్రస్తుతం స్పెషల్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా, హైకోర్టులో సేవలు అందిస్తున్నారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో సేవలందిస్తున్న, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలానికి చెందిన మరో న్యాయవాది రౌతు సురేష్ కుమార్ విజయనగరం బార్ అసోసియేషన్‌కు లక్ష రూపాయలు విరాళాన్ని, హైకోర్టు న్యాయమూర్తుల చేతుల మీదుగా అందజేశారు. సురేష్ కుమార్ ప్రస్తుతం హైకోర్టులో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ప్రాసిక్యూటర్‌గా, జీఎస్టీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. అలాగే జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది అప్పికొండ రామకృష్ణ నాయుడు, ఏపీ బార్ కౌన్సిల్‌తో కలిసి, విజయనగరం బార్ అసోసియేషన్‌కు ఐదు లక్షల రూపాయల విరాళం అందజేశారు. విరాళాలు అందించిన దాతలను, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జిల్లా పోర్టుఫోలియో జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ దుప్పల వెంకట రమణ చేతుల మీదుగా సన్మానింప చేసి విజయనగరం బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సీతయ్య మృతదేహం

రామభద్రపురం: మండలంలోని మామిడివలస గ్రామానికి చెందిన కొండపల్లి సీతయ్య (35) చెట్టుకు ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతయ్యకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది నెలల క్రితం భార్య వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. ఉన్న ఇద్దరు పిల్లలను పోషించడానికి కష్టంగా మారడంతో మనస్తాపానికి గురైన సీతయ్య శనివారం సాయంత్రం మామిడివలస, కొండకెంగువకు మధ్యలో ఉన్న చెరువు పక్కన కాగుచెట్టుకు ఉరిపోసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. తల్లి పోలమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లి వేరే వ్యక్తితో వెళ్లిపోవడం, తండ్రి మృతి చెందడంతో పిల్లలు అనాథలైపోయారని గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి



పోరుయాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని, మద్యం మత్తు పదార్థాలను నియంత్రించాలని, నిపుణులతో కమిటీ వేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐద్వా చేపట్టిన హింసపై మహిళల పోరు యాత్ర ఆదివారం విజయనగరం జిల్లా కేంద్రానికి చేరుకున్న సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఐద్వా, సీఐటీయూ, యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, శ్రామిక మహిళలు పూలుచల్లి ఘనంగా స్వాగతించారు. అనంతరం పోరు యాత్రకు వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రభావతి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. ప్రతి చోటా మహిళలపై దాడులు, అకృత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా మత్తు పదార్థాలు, మద్యం దాడులకు కారణమన్నారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని, హింసను ప్రేరేపించే చిత్రాలను, ఇంటర్నెట్‌లో అశ్లీల కార్యక్రమాలు నిషేధించాలని డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పోరుయాత్రకు స్వాగతం పలికిన వారిలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ, నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్ చంద్రపట్నాయక్, జేవీవీఆర్‌కే ఈశ్వరరావు, తిరుపతి నాయుడు, ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ నాయకురాలు పావని, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్, డీవై ఎఫ్ఐ నాయకులు హరీష్, సతీష్, బి.రమణ, త్రినాథ్, జేవీవీ సమతా మహిళా కన్వీనర్ జి.నిర్మల, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు వై.సత్యవతి పి. పూర్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమణి, జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ కార్మికుల నిరసన

- యాజమాన్యం అన్యాయం చేస్తోందని ఆవేదన
- నల్లరిబ్బన్లతో విధి నిర్వహణ



వెంకట్రామా పౌల్ట్రీస్‌లో నల్లరిబ్బన్లతో విధులు నిర్వహిస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

చీపురుపల్లి: కార్మికశాఖ అధికారుల సమక్షంలో జరిగిన అగ్రిమెంట్‌ను కనీసం అమలు చేయకుండా, కొత్త అగ్రిమెంట్‌ను పట్టించుకోకుండా యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తోందని వెంకట్రామా పౌల్ట్రీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఐ.గౌరినాయుడు, ప్రధాన కార్యదర్శి టి.ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఎ.గౌరినాయుడులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం కూడా కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తున్నామని కార్మికులకు న్యాయం జరగకపోతే భవిష్యత్‌లో నిరసన మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. 2023 మే 31 నాటికి కార్మికుల కోసం చేయదలచిన పనుల అగ్రిమెంట్‌ను కార్మికశాఖ, అధికారుల సమక్షంలో గత ఏడాది యాజమాన్యం ఇచ్చిందన్నారు. అయితే గత ఏడాది అగ్రిమెంట్‌లో ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి కొత్తఅగ్రిమెంట్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ రెండు నెలలు కావస్తున్నా యాజమాన్యం ముందుకు రావడం లేదని, ఈ నేపథ్యంలో నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. అగ్రిమెంట్‌లో భాగంగా ఈ ఏడాది ప్రతి కార్మికుడికి నెలకు కనీసం రూ.18 వేలు వేతనం కల్పించాలని, కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింపజేయాలని, గత ఒప్పందంలో భాగంగా షిఫ్ట్ డ్యూటీల సదుపాయం, ఏడాదికి 20 శాతం బోనస్, డైనింగ్ హాలు, రెస్ట్ రూం, సైకిల్ షెడ్లు నిర్మించాలని, కార్మికులందరికీ సేఫ్టీ పరికరాలు ఇవ్వాలని కోరుతూ యాజమాన్యానికి నోటీస్ అందజేసినట్లు చెప్పారు. గత ఏడాది జరిగిన అగ్రిమెంట్‌లో కూడా ఈ హామీలు నెరవేర్చేందుకు యాజమాన్యం అంగీకారం తెలిపినప్పటికీ పట్టించుకోలేదన్నారు. కార్మికశాఖ అధికారులు చొరవ చూపి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

పాము కాటుతో వ్యక్తి మృతి



పాముకాటుకు గురై మృతి చెందిన శ్రీను

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామంలో పాముకాటు బారిన పడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముగడ శ్రీను (38) శనివారం సాయంత్రం పొలం పనులు ముగించుకుని కళ్లానికి చేరుకుని పశువులకు గడ్డి వేసేందుకు వరికుప్పలు తీస్తుండగా పాము కాటువేసింది. దీంతో హుటాహుటిన ఎల్.కోట పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఎస్.కోట సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యులు చికిత్స చేసి పలుజాగ్రత్తలు చెప్పి ఇంటికి పంపించారు. రాత్రి 10 గంటల సమయంలో ఇంటివద్ద శ్రీను మృతిచెందాడు. దీనిపై మృతుడి సోదరి రమణమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎల్.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు పి ల్లలు ఉన్నారు.

మలేరియాతో గిరిజన బాలుడు..



పెద్దపల్లంకివలసలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న సిబ్బంది

సీతంపేట: మండలంలోని దోనుబాయి పీహెచ్‌సీ పరిధి పెద్దపల్లంకివలస గ్రామానికి చెందిన గిరిజన బాలుడు బిడ్డిక కార్తికేయ (6) మలేరియాతో శ్రీకాకుళం రిమ్స్‌లో శనివారం మృతిచెందాడు. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడిని సీతంపేట సీహెచ్‌సీకి తీసుకురాగా వైద్యసేవలు అందజేశారు. ఉద్యోగరీత్యా తండ్రి పెంటయ్య ఉంటున్న సరుబుజ్జిలి గ్రామానికి బాలుడు వెళ్లగా జ్వరం తీవ్రమైంది. దీంతో వెంటనే అక్కడి పీహెచ్‌సీకి తీసుకువెళ్లి పరీక్ష చేయించగా మలేరియా పాజిటివ్ రావడంతో వైద్యులు శ్రీకాకుళంలోని రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో అప్రమత్తమైన వైద్యసిబ్బంది డిప్యూటీ డీఎంహెచ్‌వో చిరంజీవి ఆధ్వర్యంలో పెద్దపల్లంకివలసలో ఆదివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరి రక్తనమూనాలు సేకరించారు. ఎటువంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్ తెలిపారు. గ్రామంలో ఐఆర్ఎస్ స్ప్రేయింగ్, బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టారు.

వ్యాధి నిరోధక టీకాలు శతశాతం లక్ష్యం

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథ రావు



డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: వ్యాధి నిరోధక టీకాలు శతశాతం లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమానికి సంబంధించి సర్వే జిల్లాలో పూర్తి కావచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.జగన్నాథ రావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ సర్వే ద్వారా వ్యాకినేషన్‌కు నోచుకోని చిన్నారులను గుర్తించి ఆగస్టు 7 నుంచి 12 వరకు జరగబోయే మొదటి దశ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమం ద్వారా ఆయా పరిధిలో వైద్య సిబ్బంది టీకా వేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే వైద్య సిబ్బంది జిల్లాలో ఉన్న మొత్తం 42 పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో ఉన్న ఇళ్లను సర్వే చేశారన్నారు. ముందస్తు ప్రణాళిక మేరకు వలస కార్మికులు, హైరిస్క్ ప్రాంతాలు, కొన్ని అనారోగ్య కారణాల వల్ల వ్యాక్సిన్‌కు నోచుకోని పిల్లలు, గర్భిణులను ఈ సర్వేలో గుర్తించి వ్యాక్సిన్‌తో నివారించదగిన వ్యాధుల (తట్టు, రుబెల్లా)ను పూర్తి స్థాయిలో నిర్మూలించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రెండవ దశ మిషన్ ఇంద్ర ధనుష్ సెప్టెంబరు 11నుంచి 16లోగా, మూడవ దశ అక్టోబర్ 9 నుంచి 14 వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ సర్వేలో గుర్తించిన అర్హులను కొత్తగా ప్రవేశ పెట్టిన యూవీ పోర్టల్‌లో నమోదు చేస్తామని తద్వారా టీకా పూర్తయిన వారికి ఆన్‌లైన్ ద్వారా వ్యాక్సిన్ సర్టిఫికెట్ జారీ చేయవచ్చని తెలిపారు. తదుపరి రోజుల్లో టీకా నిర్వహణ తర్వాత ఇదే ఆన్‌లైన్ పద్ధతిన కొనసాగుతుందని వివరించారు.

320 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పాటు వ్యాన్ సీజ్ చేస్తున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్, స్థానిక సీఐ అప్పలనాయుడు తదితరులు

గజపతినగరం: మెంటాడ మండలంలోని లోతుగెడ్డ సమీపంలో సుమారు 320 కిలోల గంజాయి పట్టుకుని సీజ్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన గజపతినగరం సర్కిల్ ఆఫీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో లోతుగెడ్డ సమీపంలో గంజాయి రవాణా అవుతున్నట్లు సమాచారం వచ్చిన మేరకు గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడు, ఆంధ్ర, గజపతినగరం ఎస్సైలు, సిబ్బంది ఆదివారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. ఈ క్రమంలో అశోక్ లేలాండ్ మ్యాక్సీ పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేస్తున్న సమయంలో డ్రైవర్ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారన్నారు. అలాగే ఆ వ్యాన్‌లో ఉన్న 320.205కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వాహనంతో పాటు గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. పోలీసులతో పాటు రెవెన్యూ సిబ్బంది నిందితుడిని విచారణ చేయగా ఒడిశాలోని కొరాపుట్ జిల్లా లమటాపుట్ దగ్గర తోసిబా గ్రామానికి చెందిన బాగ్‌బాగ్ కిల్లో(33)గా తేలిందన్నారు. గంజాయి ప్యాకెట్లతో పాటు రూ.7వేలు నగదు, మ్యాక్సీ క్యాబ్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుడిని విచారణ చేయగా రాహుల్ ఖా, జోగేషు సరుకుకు సంబంధించిన వ్యక్తులుగా చెప్పడంతో వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా కారు బొండపల్లి మండలం బోడసింగుపేట వద్ద విడిచిపెట్టి పరారయ్యారని దీంతో ఆ కారును కూడా సీజ్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎల్.అప్పలనాయుడు, ఆంధ్ర, గజపతినగరం ఎస్సైలు సిద్ధార్థ, గంగరాజులు పాల్గొన్నారు.

లాడ్జిలో మహిళ హత్య

- నిర్వాహకుల నిర్లక్ష్యంతో లభ్యం కాని ఆధారాలు
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు



హత్య జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ గోవిందరావు



హత్య జరిగిన చందన్‌లాడ్జి ఎదుట గుమిగూడిన జనం

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ-అరకు రహదారిలో ఉన్న చందన్ ఎ.సి లాడ్జిలో ఓ మహిళ హత్యకు గురైన విషయం ఆదివారం బయటకు పొక్కడంతో ఒక్కసారిగా పట్టణవాసులు ఉలిక్కి పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చందన్ లాడ్జి సర్వీస్ బాయ్ రూమ్ సర్వీస్ కోసం వెళ్లిన సమయంలో రూమ్ నంబర్ 103నుంచి దుర్వాసన వస్తోందని, చెప్పడంతో నిర్వాహకులు అనుమానంతో 100కి కాల్ చేశారు. దీంతో పోలీసులు వచ్చి రూమ్ తలుపులు తెరిచి చూడగా లాడ్జి గదిలో మహిళ మృతదేహం పడి ఉండడంతో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి, క్లూస్‌టీమ్‌ను రప్పించారు. డీఎస్పీ గోవిందరాజు ఘటనాస్థలిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రూమ్ తీసుకున్నది అల్లూరి జిల్లా వాసి

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకువ్యాలీ మండలం పరిధి ఉరుముల గ్రామానికి చెందిన మాదల శ్రీరాములు ఈ నెల 24న పట్టణంలోని చందన్ ఎ.సి లాడ్జిలో రూమ్ నంబర్ 103ను బుక్ చేశాడు. 27 వరకూ ప్రతిరోజూ లాడ్జికి వచ్చి రోజువారీ అద్దె రూ.600 చెల్లించాడు. 29, 30 తేదీల అద్దె చెల్లించకపోవడంతో ఆదివారం ఉదయం 10.52గంటల సమయంలో కాల్ చేస్తే ఫోన్‌పే చేస్తానని చెప్పినట్లు లాడ్జి సిబ్బంది తెలిపారు.

లాడ్జిలో లేని సీసీ కెమెరాలు

హత్య జరిగిన లాడ్జిలో ప్రవేశం వద్ద, రిసెప్షన్ కౌంటర్ల వద్ద సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల లాడ్జిలోకి వచ్చిన వారి వివరాలు నమోదు కాలేదు. హత్యలో ఎవరి ప్రమేయం ఉంది? ఎందరు ఉన్నారు? ఎప్పుడు జరిగింది? హత్యకు కారణం ఏమిటి? అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

హత్య జరిగి ఐదారు రోజులు

హత్య ఘటనపై కొత్తవలస సీఐ చంద్రశేఖర్ వివరణ ఇస్తూ... లాడ్జిలోని రూమ్ నంబర్ 103లో దుర్వాసన వస్తోందని ఫిర్యాదు చేయడంతో వచ్చి డోర్ ఓపెన్ చేసి చూసి మహిళ మృతదేహం ఉండడం గమనించాం. బహుశా హత్య జరిగి ఐదారు రోజులు కావచ్చని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించామని చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	60,380-00
బంగారం(22కే. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220